## క్లుప్తంగా

### 31 న మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

**జగ్గయ్యపేటఅర్బన్:** ఈనెల 28 వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం అనివార్య కారణాల వలన ఈనెల 31 వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర గురువారం తెలిపారు. కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో జరిగే ఈ సమావేశంలో పట్టణంలోని పలు అభివృద్ధి పనులు, పరిపాలనకు సంబంధించిన కేటాయింపులు తదితర 65 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ సభ్యుల ఆమోదం కోసం సిద్ధం చేసినట్లు తెలిపారు. గౌరవ కౌన్సిల్ సభ్యులు, గౌరవ ఎక్స్-అఫిషియో మెంబర్లు హాజరు కావాలని కోరారు.

**కౌన్సిల్ అత్యవసర సమావేశం**

ఈ నెల 31 వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర గురువారం తెలిపారు. కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో జరిగే ఈ సమావేశంలో 15 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ సభ్యుల ఆమోదం కోసం సిద్ధం చేసినట్లు తెలిపారు.

### విద్యుత్ ఏఈపై చర్యకు ఎస్ఎఫ్ఐ డిమాండ్

**జగ్గయ్యపేటఅర్బన్:** ఎస్సీ బాలికల ఇంటిగ్రిటీ హాస్టల్‌లో విద్యుత్ సమస్యల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పట్టణ విద్యుత్ ఏఈపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఎస్సీ బాలికల ఇంటిగ్రిటీ హాస్టల్‌లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను గురువారం ఎస్ఎఫ్ఐ నాయకులు పరిశీలించారు. ఎస్ఎఫ్ఐ జగ్గయ్యపేట మండల అధ్యక్షుడు ఎం.రాజు మాట్లాడుతూ హాస్టల్ ప్రాంగణంలో విద్యుత్ తీగలు కిందకు జారిపోయి ప్రమాదకరంగా ఉన్నాయని, వాటిని పైకి లాగాలని పలుమార్లు అధికారులకు అర్జీలు పెట్టినా స్పందించడం లేదన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే అందుకు విద్యుత్ శాఖ అధికారులే మూల్యం చెల్లించాల్సి ఉంటుందన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించకుంటే హాస్టల్ వద్ద ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు.

### వస్త్ర దుకాణంలో అగ్ని ప్రమాదం

**నందిగామ:** పట్టణంలోని గాంధీ సెంటర్‌లో ఓ వస్త్ర దుకాణంలో గురువారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో దుకాణంలోని దుస్తులతో పాటు దుకాణం పూర్తిగా దెబ్బతింది. నష్టం సుమారు రూ.10 లక్షల వరకు ఉంటుందని షాపు యజమాని తెలిపారు.

### ముంపు ప్రాంతాలు పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

**జగ్గయ్యపేటఅర్బన్:** పట్టణంలో ముంపునకు గురయ్యే ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగమల్లేశ్వరరావు గురువారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక 24 వ వార్డు, యానాది కాలనీలో కొన్ని గృహాలు పాలేటి వరద ముంపునకు గురయ్యే ప్రమాదం ఉండటంతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఆదేశాల మేరకు 15 కుటుంబాలను సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్నట్లు తెలిపారు. సమీపంలో ఉన్న ఉర్దూ పాఠశాలలోకి వారిని తరలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సాధు పాటి రాజు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, మున్సిపల్ డీఈ, ఏఈలు శివ కోటేశ్వరరావు, హనుమంతరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### కలాంకు ఘన నివాళి

**జగ్గయ్యపేటఅర్బన్:** భారత దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మహనీయుడు ఏపీజే అబ్దుల్ కలాం అని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. భారత మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక కోదాడ రోడ్‌లోని కలాం విగ్రహానికి వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ తదితర నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు పెంటి శ్రీను, ఏఎంసీ వైస్ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, పార్టీ ఎస్టీ విభాగం అధ్యక్షుడు బద్దూనాయక్, ముస్లిం మైనార్టీ విభాగం నియోజకవర్గ, పట్టణ అధ్యక్షులు రస్ హుస్సేన్, షేక్ మొహిద్దీన్, షాదీఖానా కమిటీ అధ్యక్షుడు ఎక్బైడ్ బాషా, మైనార్టీ నాయకులు ఫిరోజ్‌ఖాన్, ఖాసిం సైదా, ఖాజా పాల్గొన్నారు.

### రైతుల సంక్షేమానికే కిసాన్ సమృద్ధి

**వీరులపాడు:** రైతుల సంక్షేమానికే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కిసాన్ సమృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారని ఎంపీపీ కోటేరు లక్ష్మి తెలిపారు. మండలంలోని జుజ్జూరు, అల్లూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాలను వ్యవసాయాధికారులతో కలిసి గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు మెరుగైన సేవలందించేందుకు రిటైల్ ఎరువుల దుకాణాలను దఫాల వారీగా పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాలుగా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ కేంద్రాల్లో భూసార పరీక్షలు, కల్తీ లేని నాణ్యమైన విత్తనాలు, వ్యవసాయ యాంత్రీకరణ అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏవో జోగేంద్ర ప్రసాద్, సర్పంచ్‌లు రమావత్ కోటి, బందెల రాణి, ఉప సర్పంచ్ పసుపులేటి సాయిబాబు, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, వైస్ ఎంపీపీలు షేక్ నాగుల్‌మీరా, వేమూరి ఆదాం, ఎంపీటీసీ సభ్యులు మోంద్రు బాయమ్మ, తమ్మిశెట్టి వరలక్ష్మి, పలువురు నాయకులు పాల్గొన్నారు.


పెనుగంచిప్రోలులో పునరావాస ఏర్పాట్లపై మాట్లాడుతున్న సర్పంచ్ పద్మకుమారి, తహసీల్దార్ లక్ష్మీకల్యాణి, ఎస్ఐ దుర్గాప్రసాద్


కంచల వరదలో చిక్కుకున్న వారిని ఒడ్డుకు తీసుకువచ్చేందుకు అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్


కంచికచర్ల మండలం గండేపల్లి- కీసర మధ్య పొంగుతున్న వాగులోంచి వెళ్లుతున్న లారీ


కునికెనపాడు లంకభూముల్లో ఇరుక్కుపోయిన రైతులను పడవ సాయంతో ఒడ్డుకు చేర్చుతున్న దృశ్యం

# ఉగ్రరూపం దాల్చిన ఉపనదులు


బూదవాడ-రెడ్డినాయక్‌తండా పాలేటి బ్రిడ్జిపై ఉధృతంగా ప్రవహిస్తున్న పాలేరు వాగు


మునేరు కాజ్‌వేపై ప్రవహిస్తున్న వరద నీరు


కంచికచర్ల మండలం కీసర గ్రామంలో మున్నేటి ఒడ్డున నీట మునిగిన పంట పొలాలు


వరద నీటికి కొట్టుకొస్తున్న పాములు

- ఐతవరం వద్ద జాతీయ రహదారిపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు
- నిలిచిపోయిన రాకపోకలు
- కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు
- సహాయ చర్యల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు

**నందిగామ:** వర్షాల కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు ఉపనదులకు చేరుకుంటోంది. ఈ నేపథ్యంలో గురువారం వరద నీరు మరింత పెరిగి ఉపనదులు ఉగ్రరూపం దాల్చాయి. నందిగామ డివిజన్ పరిధిలో మున్నేరు, వైరా, కట్టలేరులకు భారీగా వరద నీరు వస్తోంది. అనేక వాగులు కూడా పొంగిపొర్లడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

**జాతీయ రహదారిపై మూడడుగుల మేర వరద నీరు**

మున్నేరుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ నేపథ్యంలో నందిగామ మండలం ఐతవరం సమీపంలో 65వ నంబర్ జాతీయ రహదారిపై నుంచి సుమారు మూడు అడుగుల మేర దాదాపు కిలోమీటర్ దూరం పైగా వరద నీరు ప్రవహిస్తోంది. సాయంత్రం ఐదు గంటల నుంచి వరద ఉధృతి పెరిగింది. ఈ నేపథ్యంలో జాతీయ రహదారిపై కిలోమీటర్ల దూరం మేర వాహనాలు నిలిచిపోయాయి. వరద తీవ్రత పెరగడంతో డివిజన్ పరిధిలోని అధికారులు అప్రమత్తమయ్యారు. ఏసీపీ జనార్ధన్ నాయుడు వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించడంతో పాటు డివిజన్ పరిధిలోని అధికారులను అప్రమత్తం చేశారు.

**చెరువులను తలపిస్తున్న పొలాలు**

మండలంలోని దాములూరు, సోమవరం, రుద్రవరం, అనాసాగరం, నందిగామ, అంబారుపేట, ఐతవరం, కంచల తదితర గ్రామాల పరిధిలో వరద నీటి కారణంగా పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. పట్టణంలోని పెద్ద మసీద్ ప్రాంతంలోని ఇళ్లలోకి సైతం వరద నీరు ప్రవహించింది. వైరా నదికి కూడా భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ నేపథ్యంలో పరివాహక గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. అధికారుల లెక్కల ప్రకారం ఎగువ ప్రాంతాల నుంచి మున్నేరుకు గురువారం రాత్రి 8 గంటల సమయానికి వరద నీరు 1.82 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరి దిగువకు ప్రవహిస్తోంది. వరద నీరు మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

**శ్రీతిరుపతమ్మ వారి సత్రాల్లో పునరావాస కేంద్రం ఏర్పాటు**

**పెనుగంచిప్రోలు:** వాయుగుండం ప్రభావంతో కరీంనగర్, వరంగల్, ఖమ్మం ప్రాంతాల్లో ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో పెనుగంచిప్రోలు వద్ద మునేరు ఉగ్రరూపం దాల్చింది. 10 ఏళ్ల క్రితం వచ్చిన దాని కన్నా ఎక్కువగా వరద ప్రభావం ఉందని స్థానికులు అంటున్నారు. కాజ్‌వే మునిగి 5 అడుగులు మేర నీరు వరద నీరు ప్రవహించటంతో ఆంధ్రా-తెలంగాణ మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మునేరు అవతల 10 గ్రామాలకు పూర్తిగా సంబంధాలు తెగిపోయాయి. వరద ప్రభావానికి మునేరు పక్కన ఉన్న మామిడి తోటలు నీటిలో మునిగిపోగా దుకాణాలు మొత్తం నీటిలోనే ఉన్నాయి. అమ్మవారి ఆలయం వద్ద వ్యాపారాలు చేసుకునే దుకాణదారులు సరుకును బయటకు తెచ్చుకునేందుకు పడరాని పాట్లు పడ్డారు. కొంత సరుకు నీటిలో తడిసి ముద్దయింది. ఆలయ కేశ ఖండనశాల పూర్తిగా నీటిలో మునిగిపోవటంతో వేరే ప్రదేశానికి దానిని మార్చారు. ఆలయం ముందు బోసుపేటలో ఇళ్లల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరటంతో వారిని ఆలయ సత్రాల్లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. ఎమ్మెల్యే ఉదయభాను సూచనల మేరకు వారికి సర్పంచ్ వేల్పుల పద్మకుమారి ఆధ్వర్యంలో ఆలయ అధికారులు ఆహార ఏర్పాట్లు చేశారు. మునేరు పక్కన లోతట్టు ప్రాంతాల్లో నివశిస్తున్న వారిని తక్షణం ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, ఎస్ఐ సీహెచ్‌కే దుర్గాప్రసాద్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వేల్పుల రవికుమార్, మైనింగ్, పూసల కార్పొరేషన్ డైరెక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, ఇరిగేషన్ డీఈ రామకృష్ణారావు, జేఈ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. జెడ్పీటీసీ వూట్ల నాగమణి కూడా వరద ప్రాంతాల్లో స్థానికులతో కలిసి పర్యటించారు.

**మున్నేటికి 1.82 లక్షల క్యూసెక్కుల వరదనీరు**

**కంచికచర్ల:** తెలంగాణ రాష్ట్రం ఖమ్మం, వరంగల్, వైరా, మధిర ప్రాంతాలతో పాటు రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా భారీగా కురుస్తున్న వర్షాల కారణంగా కంచికచర్ల మండలం కీసర మున్నేటికి భారీగా వరదనీరు చేరింది. మున్నేటికి 1.82 లక్షల క్యూసెక్కుల వరదనీరు వచ్చిందని సీడబ్ల్యూసీ అధికారులు గురువారం తెలిపారు. ఇంకా వరద నీరు వచ్చే అవకాశాలు ఉన్నాయని వారంటున్నారు. కీసర గ్రామంలో మున్నేరు, కట్టలేరు, వైరా ఉపనదులు కలవటంతో భారీగా వరదనీరు వస్తుంది.

**పొంగుతున్న వాగులు...**

మున్నేటికి భారీగా వరదనీరు చేరటంతో మున్నేరుకు సమీపంలోని గండేపల్లి, పెండ్యాల, వేములపల్లి గ్రామాల మధ్య ఉన్న వాగులు పొంగుతున్నాయి. వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పొంగుతున్న వాగుల వద్ద రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులను ఎంపీడీఓ కె.బాలశంకరరావు, డెప్యూటీ తహసీల్దార్ షేక్ నాగుల్‌మీరా, నందిగామ రూరల్ సీఐ ఐవీ నాగేంద్రకుమార్, ఎస్ఐ పెంకె సత్య వెంకట సుబ్రహ్మణ్యం పరిశీలించారు. ప్రవహిస్తున్న వాగుల్లోంచి ఎవరూ దిగరాదని పోలీసులను అప్రమత్తం చేశారు.

**లింగాల వద్ద మునేటికి పోటెత్తిన వరద**

**వత్సవాయి:** ఎగువప్రాంతాలైన తెలంగాణలోని వరంగల్, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు పడుతుండడంతో మునేటికి రెండవరోజు కూడా భారీస్థాయిలో వరద నీరు వచ్చి చేరింది. బుధవారం రాత్రికి కొంచెం వరద తగ్గడంతో లింగాల వద్ద కాజ్‌వేపై రాకపోకలు సాగించారు. అయితే అర్ధరాత్రి సమయంలో ఒక్కసారిగా వరద పెరగడంతో తహసీల్దార్ వైకుంఠరావు, ఎస్ఐ బి.అభిమన్యు సిబ్బందిని అప్రమత్తం చేసి కాజ్‌వేకు ఇరువైపులా కాపలా ఉంచారు. గురువారం సాయంత్రానికి 18 అడుగులు మేర వరద వచ్చినట్లు ఇరిగేషన్ అధికారి రామనరసింహారావు తెలిపారు. ఎగువ నుంచి 1,84,146 క్యూసెక్కుల మేర వరద వస్తుండగా అదే స్థాయిలో కిందకు వెళుతోంది. మునేటి కాలువకు కూడా వరద పోటెత్తడంతో కాలువ కట్ట తెగి పొలాలపై పడతాయని రైతులు భయపడుతున్నారు. చిట్టేల సమీపంలో మాగాణి భూముల మీదుగా వరదనీరు పారుతోంది.

**ఉధృతంగా ప్రవహిస్తున్న పాలేరు**

**జగ్గయ్యపేట:** తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నియోజకవర్గంలో మున్నేరు, పాలేరు గత రెండు రోజులుగా ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గురువారం ఎగువ నుంచి వరద ఉధృతంగా రావటంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని అన్నవరం వద్ద పాలేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో బూదవాడ, జగ్గయ్యపేట, ముక్త్యాల, రెడ్డినాయక్ తండాలకు రాకపోకలను అధికారులు నిలిపివేశారు. బూదవాడలో దూళ్లవాగు ప్రమాదకరంగా ప్రవహిస్తుండటంతో గ్రామం నుంచి జగ్గయ్యపేటకు వెళ్లే రహదారులను పోలీస్, పంచాయతీ అధికారులు మూసివేశారు. పాలేరు నది పరివాహక గ్రామాల్లో నివాసముంటున్న వారిని అధికారులు ఖాళీ చేయించారు. తహసీల్దార్ చిన్నారావు, ఎస్ఐ కృష్ణబాబు ఎప్పటికప్పుడు వరద సమాచారం తెలుసుకుంటూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు తమ వంతు సేవలందిస్తున్నారు.

**రైతులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన అధికారులు**

**కంచికచర్ల:** లంక భూముల్లో వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లిన ఏడుగురు రైతులు గురువారం ఒక్కసారిగా పెరిగిన మునేటి వరద ఉధృతి కారణంగా అక్కడ ఇరుక్కుపోయారు. అయితే వెంటనే గమనించిన అధికారులు, గ్రామస్తులు నాటు పడవ ద్వారా వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. వివరాలిలా ఉన్నాయి మండలంలోని మోగులూరు గ్రామానికి చెందిన ఇద్దరు, కునికెనపాడు గ్రామానికి చెందిన ఐదుగురు రైతులు గురువారం ఉదయం లంక భూముల్లో వరి నాట్లు వేసే నిమిత్తం ట్రాక్టర్‌తో దుక్కి దున్నేందుకు వెళ్లారు. అయితే మున్నేటికి అకస్మాత్తుగా భారీగా వరదనీరు చేరింది. దీంతో ఆ ఏడుగురు రైతులు లంక భూముల్లోనే ఇరుక్కుపోయారు. ప్రమాదాన్ని ముందుగానే గుర్తించిన సర్పంచి బండారుపల్లి సత్యనారాయణ, గ్రామస్తులు, అధికారులు నాటు పడవను పంపించి వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ముందుగా ఐదుగురిని, రెండవ దపా మరో ఇద్దరు రైతులను ఒడ్డుకు తీసుకువచ్చారు. వారిలో కునికెనపాడుకు చెందిన చిరుమామిళ్ల శివ, ఉయ్యూరు మాధవరావు, పొందుగల సురేష్, రాయల వెంకటేశ్వరరావు, కొంగర మల్లికార్జునరావు, మోగులూరుకు చెందిన షేక్ బాబు, షేక్ ఖాజా ఉన్నారు. వారిని ఒడ్డుకు చేర్చిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వేల్పుల రమేష్, ఎంపీడీఓ కె.బాలశంకరరావు, డెప్యూటీ తహసీల్దార్ షేక్ నాగుల్‌మీరా, వీఆర్వో ప్రదక్షిణరావు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

**వరద నీటిలో విషసర్పాల బెడద**

**పెనుగంచిప్రోలు:** మునేరు వరద ఉధృతి గంటగంటకు పెరుగుతోంది. గతంలో 15 ఏళ్ల క్రితం వచ్చిన వరద కంటే ఎక్కువగా ఉందని గ్రామస్తులు అంటున్నారు. వరద నీరు మొత్తం ప్రధాన రహదారులపైకి చేరింది. మోకాలు లోతు పైన నీళ్లు రోడ్లపై ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరటంతో ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. వరద నీటికి విషసర్పాలు, పురుగులు, తేళ్లు ఇళ్లల్లోకి చొరబడుతున్నాయి.

**కీసర వద్ద జాతీయ రహదారిపై వాహనాల నిలిపివేత**

**కంచికచర్ల:** కంచికచర్ల మండలం కీసర వద్ద జాతీయ రహదారిపై వరద నీరు రావటంతో విజయవాడ నుంచి హైదరాబాద్ వెళుతున్న వాహనాలను పోలీసులు నిలిపివేశారు. మున్నేటికి గురువారం వరదనీరు చేరటంతో పాటు నందిగామ మండలం ఐతవరం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై వరదనీరు ఉధృతంగా ప్రవహించడంతో ఈ చర్యలు తీసుకున్నారు. మండలంలోని కీసర, పేరకలపాడు గ్రామాల వద్ద రోడ్డు పక్కన హైదరాబాద్ వైపు వెళ్లే బస్సులు, లారీలు, కార్లను ఎక్కడివక్కడే ఆపివేస్తున్నారు. హైదరాబాద్ వైపునకు వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు తమ ప్రయాణాన్ని వాయిదా వేసుకోవాలని పోలీసులు, రెవెన్యూ అధికారులు విజ్ఞప్తి చేశారు.

## అధైర్య పడొద్దు.. సురక్షితంగా తీసుకువస్తాం..

**ఎమ్మెల్సీ అరుణకుమార్**

**నందిగామటౌన్/నందిగామ:** మండలంలోని కంచల గ్రామ సమీపంలో పంట పొలాలకు మందు చల్లేందుకు వెళ్లిన 13 మంది రైతులు వరదలో చిక్కుకున్నారు. ఉదయం వరద లేకపోవటంతో పొలాలకు వెళ్లిన రైతులు ఒక్కసారిగా వరద ఉధృతంగా రావటంతో సమీపంలోని లిఫ్ట్ ఇరిగేషన్ పంప్ హౌస్ భవనంపైకి చేరుకుని సురక్షితంగా ఉన్నారు. విషయం తెలుసుకున్న శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ గ్రామానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. వరదలో చిక్కుకున్న కోలుగుంట్ల సత్యనారాయణ, పెర్నా సాంబయ్య, రామిరెడ్డి కొండ, కస్తాల కర్నేష్, వేమవరపు నాని, కొమ్మూరి ఇజ్రాయేల్, యద్దనపూడి రవి, యద్దనపూడి ఆదాం, యద్దనపూడి వెంకటేశ్వర్లు, పాన్నూరి శామ్యేలు, కొమ్మూరి సీమోన్‌లను రక్షించేందుకు ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు గ్రామానికి చేరుకున్నాయి. అర్ధరాత్రిలోగా వారిని బయటకు తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని అరుణకుమార్ తెలిపారు. చెవిటికల్లులో వరదలో చిక్కుకున్న ఇద్దరిని నాటు పడవల సహాయంతో రక్షించినట్లు చెప్పారు. పోలీసులు గురువారం సాయంత్రం నుంచి జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ అలుపెరగకుండా శ్రమిస్తున్నారు.


జాతీయ రహదారి వద్ద సహాయక చర్యల్లో ఎమ్మెల్సీ అరుణకుమార్, రైల్వే ఎస్పీ విశాల్‌గున్నీ,అధికారులు

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ఎమ్మెల్యే జగన్‌మోహనరావు**

**నందిగామటౌన్:** వరద ఉధృతి అధికంగా ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. వరద ముంపునకు గురైన పట్టణంలోని పలు ప్రాంతాలను గురువారం రాత్రి ఆయన పరిశీలించారు. ట్రాక్టర్‌పై కూర్చుని ప్రమాదకర పరిస్థితిలో పట్టణంలోని ఒకటి, ఏడవ వార్డులలో పూర్తిగా జలమయమైన లోతట్టు ప్రాంతాలను ఆయన పరిశీలించి ప్రజలకు ధైర్యం చెప్పారు. ఎవరూ భయపడొద్దని, పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, తక్షణమే కేంద్రాలకు తరలిరావాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో అన్ని వసతుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జయరాం, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.


నందిగామ పట్టణంలో ముంపు ప్రాంతంలో పర్యటించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు


శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద దుకాణాల్లో చేరిన వరద నీరు


బూదవాడ-జగ్గయ్యపేట రహదారిపై ఉధృతంగా దూళ్లవాగు


అంబారుపేట ప్రాంతంలో చెరువును తలపిస్తున్న పొలాలు


పెనుగంచిప్రోలు బోసుపేటలో ఇళ్లల్లోకి చేరిన వరద నీరు

# ప్రతి ఓటూ కీలకమే

**వైఎస్సార్ సీపీ బీఎల్ఏల శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అరుణకుమార్**

**నందిగామటౌన్:** ప్రతి ఒక్క ఓటూ కీలకమేనని బూత్ లెవల్ ఏజెంట్‌లు ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియను బాధ్యతగా నిర్వహించాలని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి బూత్ లెవల్ ఏజెంట్‌ల శిక్షణ కార్యక్రమం స్థానిక శ్రీకరం కల్యాణ మండపంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమన్నారు. ఏజెంట్లు 18 ఏళ్లు నిండిన వారిని గుర్తించి ఓటరుగా నమోదు చేయించటంతో పాటు మృతి చెందిన వారు, గ్రామంలో నివాసం ఉండని వారిని, డబుల్ ఎంట్రీ ఓటర్‌లను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. గృహ సారథులు, బీఎల్ఏలు, సచివాలయ కన్వీనర్‌లతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని చెప్పారు.


బీఎల్ఏల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

**మిస్సైల్ మ్యాన్‌కు ఘన నివాళి**

భారత మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ ఏపీజె అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్సీ అరుణకుమార్ పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం భారత జాతికి కలాం అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ అరిగెల సుందరమ్మ, జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, అమర్లపూడి కీర్తి సౌజన్య, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, వైఎస్సార్ సీపీ నాయకులు దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, మంచాల చంద్రశేఖర్, ఆవుల రమేష్ బాబు, వేమా సురేష్‌బాబు, నన్నపనేని నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముస్లింలకు పెద్ద పీట

**జగ్గయ్యపేటఅర్బన్:** దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిల హయాంలో గతంలో ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా ముస్లింల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చి పెద్ద పీట వేశారని పలువురు మైనార్టీ నాయకులు అన్నారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బుధవారం టీడీపీ నాయకులు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రస్ హుస్సేన్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో ముస్లింలకు చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమేనా అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడు మొహిద్దీన్ మాట్లాడుతూ దేశంలోనే ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు రూ.80 వేలు సహాయం చేశారన్నారు. పేటలో 2006 లోనే ఎమ్మెల్యే ఉదయభాను రూ.10 లక్షల వ్యయంతో ఈద్గాకు ప్రహరీ, చప్టా నిర్మించారని తెలిపారు. మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యుడు ఫిరోజ్‌ఖాన్ మాట్లాడుతూ ముస్లింలకు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్, మున్సిపల్ వైస్ చైర్మన్‌గా, జిల్లా వక్ఫ్ బోర్డులో పదవులు, మున్సిపల్ కోఆప్షన్ పదవులు ఇచ్చిన ఘనత ఉదయభానుదే అన్నారు. రూ.10 కోట్ల విలువైన స్థలాన్ని షాదీఖానాకు కేటాయించి, జామియా మసీదు నిర్మాణానికి కృషిచేసింది ఉదయభానే అని అన్నారు. సమావేశంలో షాదీఖానా చైర్మన్ ఎక్బైడ్ బాషా, దర్గా కమిటీ చైర్మన్ ఖాజా, జామియా మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



**సవరణ**

ది. 24-07-2023 సాక్షి దినపత్రికలో నందిగామ డివిజన్‌లో ప్రచురితమైన M/s. Shriram Finance Ltd. జగ్గయ్యపేట బ్రాంచి వారి మార్ట్గేజు ... ప్రకటనలో ఫ్లాట్ నెం. 1338 బదులుగా 308/701గా పొరపాటుగా ప్రచురితమైనది. కావున ఈ ప్రకటనలో ఫ్లాట్ నెం. 133గా చదువుకోగలరు.
రాయపూడి శ్రీనివాసరావు, అడ్వకేట్ & నోటరీ